సాక్షి
రంగారెడ్డి
శనివారం । 22 । జూన్ । 2024



లీక్ బాధ్యత కేంద్రానిదే..

నీట్ పేపర్ లీక్‌కు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 8లో▸



విద్యతో ఉజ్వల భవిష్యత్

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. 8లో▸



దొంగలను పట్టుకుంటాం

దారి దోపిడీ చేస్తున్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ బల్ల రాజేశ్ వెల్లడించారు. 8లో▸

న్యూస్‌రీల్

ట్రైనీ ఐఏఎస్‌ల క్షేత్రస్థాయి పర్యటన



మొయినాబాద్‌రూరల్: నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్/మొయినాబాద్: రాజేంద్రనగర్‌లోని ఎస్‌ఐఆర్‌డీలో శిక్షణ పొందడానికి వచ్చిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జస్లీన్ కౌర్, అర్పిత్‌గుప్తా, అక్షయ్‌క్ష్ చౌదరి శుక్రవారం మొయినాబాద్ మండలంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ముందుగా మండలంలోని అజీజ్ నగర్ గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అక్కడున్న మండల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ వారికి ఆశీర్వాదం అందించి ఆలయ విశిష్టతను తెలియజేశారు. వారి వెంట జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, డీఎల్‌పీఓ సతీష్, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



హయత్‌నగర్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. మండలంలోని తట్టిఅన్నారం, కుంట్లూర్‌లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పలు నిర్మాణాలను కూల్చివేశారు. తట్టిఅన్నారంలోని సర్వే నంబర్ 117, కుంట్లూర్‌లోని సర్వే నంబర్ 24లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారంతో రెవెన్యూ సిబ్బంది శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో వాటిని కూల్చి వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్‌దత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆక్రమణ దారులు ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



షాబాద్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

షాబాద్: వర్షాకాలంలో రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి వ్యవసాయ విస్తీర్ణ అధికారులను ఆదేశించారు. షాబాద్ క్లస్టర్‌లోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసి వివిధ పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటలను సర్వే నంబర్ల వారీగా పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సరిపడా ఉన్నాయని చెప్పారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశం, షాబాద్ క్లస్టర్ ఏఈఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధికి సంఘటితంగా పని చేయాలి

టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం


షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సంఘటితంగా పని చేయాలని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ప్రొఫెసర్ జయశంకర్ అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఎన్నో ఉద్యమాలుచేసి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటినాగయ్య, టీజేఏసీ నాయకులు, తెలంగాణవాదులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

యోగా.. మంచిదేగా!





నిజాం కాలేజీ గ్రౌండ్‌లో యోగాసనాలు వేస్తున్న ఔత్సాహికులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు



సంజీవయ్య పార్కులో యోగా చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ





భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగం. ఆరోగ్యకర జీవన విధానానికి యోగా ఒక అమోఘమైన సాధనం.. అందరూ యోగా చేయాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. నగరంలోని నిజాం కళాశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు.

టారిఫ్ చేయాల్సిందే!

ఆలస్యంగా బిల్లు.. జేబుకు చిల్లు

- కస్టమర్లకు శాపంగా డిస్కం అలసత్వం
- విద్యుత్ బిల్లుల జారీలో సిబ్బంది నిర్లక్ష్యం
- నెలదాటిన తర్వాత అందజేస్తున్న వైనం
- మారిపోతున్న టారిఫ్ చార్జీలు
- వినియోగదారులకు అదనపు భారం
- పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపట్నం: డిస్కం నిర్లక్ష్యం వినియోగదారులకు శాపంగా మారుతోంది. నెలనెలా సక్రమంగా జారీ చేయాల్సిన బిల్లుల్లో జాప్యంతో జేబుకు చిల్లు పడుతోంది. విద్యుత్ వినియోగదారుడికి ప్రతి 30 రోజులకోసారి వినియోగించిన యూనిట్లు లెక్కించడం.. ఏ కేటగిరీకి వస్తుందో ఆ మేరకు బిల్లు జారీ చేయడం.. నిర్ణీత గడువులోగా వసూలు చేయడం ఎస్పీడీసీఎల్ అనుసరిస్తున్న విధానం. కానీ ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నెలరోజులకు ఇవ్వాల్సిన బిల్లులు 40 నుంచి 50 రోజుల వరకు కూడా జారీ చేస్తున్నారు. కొందరికి నెలవారీగా కాకుండా రెండు, మూడు నెలలకోసారి మీటర్ రీడింగ్ తీసుకుని బిల్లులు జారీ చేయడం గమనార్హం. బిల్లుల జారీలో తీవ్ర జాప్యంతో కస్టమర్ వాడిన యూనిట్ల సంఖ్య భారీగా పెరిగి టారిఫ్ మారిపోతోంది. ఫలితంగా వినియోగదారుడిపై తీవ్ర భారం పడుతోంది. రూ.వందల్లో రావాల్సిన బిల్లులు వేలల్లోకి పెరుగుతుండడంతో డిస్కం అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులపైనా స్పందన కరువు

ఓ వినియోగదారుడికి వెయ్యి యూనిట్లు వినియోగించారంటూ రూ.10వేలు బిల్లు జారీ చేశారు. దీనిపై కార్యాలయంలో ఆరా తీస్తే జూన్ 2023 నుంచి మార్చి 2024వరకు డోర్‌లాక్ ఉండడంతో బిల్లు జారీ చేయలేదని.. ఆ తర్వాత కరెంటు మీటరు పని చేయని కారణంగా వెయ్యి యూనిట్లకు బిల్లు వేసినట్లు చెప్పడంతో అవాక్కయ్యాడు. దీనిపై ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా స్పందించకపోవడంతో డివిజన్ కార్యాలయంలో, ఆ తర్వాత సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో, చివరికి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంప్రదించినా ఫలితం లేకపోయింది. నెలవారీ బిల్లుల జారీలోనే కాదు.. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపైనా డిస్కం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బిల్లులో పొరపాట్లు, కొత్త మీటరు జారీ, ఇతర కనెక్షన్ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ప్రతి నెలా ఆలస్యమే..

కరెంటు బిల్లుల జారీలో డిస్కం సిబ్బంది ప్రతి నెలా తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఉదాహరణకు ఒక కస్టమర్ రోజుకు సగటున 3 యూనిట్ల చొప్పున వినియోగిస్తుంటే 30 రోజులకు 90 యూనిట్ల చొప్పున నెలవారీ బిల్లు రూ.234తో పాటు ఇతర చార్జీలు కలుపుకొని రావాలి. బిల్లు జారీలో జాప్యం జరగడం.. 40 రోజులకు బిల్లు జారీ చేయడంతో రూ.516కు అదనంగా ఇతర చార్జీలతో కలిపి రూ.700 పైబడి వస్తోంది. సాధారణంగా చెల్లించాల్సిన మొత్తం కంటే మూడురెట్లు అధికంగా బిల్లులు వస్తుండడంతో అధికారుల తీరుపై కస్టమర్లు మండిపడుతున్నారు.

ప్రస్తుతం చార్జీల టారిఫ్ ఇలా..

కేటగిరీ	యూనిట్లు	చార్జీ(రూ.)
కేటగిరీ-1(ఎ) డొమెస్టిక్	మొదటి 50	1.45
-	51 నుంచి 100	2.60
కేటగిరీ-1 (బి1)డొమెస్టిక్	100 వరకు	3.30
-	101-200	4.30
కేటగిరీ-1 (బి2)డొమెస్టిక్	0-200	5.00
-	201-300	7.20
-	301-400	8.50
-	401-800	9.00
-	800 పైబడి	9.50

38 రోజులకు లెక్కించారు



కొన్ని నెలలుగా కరెంటు బిల్లు 30 రోజులకు కాకుండా 35 రోజులకు, 38 రోజులకు జారీ చేస్తున్నారు. దీంతో రూ.200 లోపు రావాల్సిన బిల్లు రూ.450పైగా వస్తోంది. రీడింగ్ తీసుకునే సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా తీరు మాత్రం మారడం లేదు.

– సీహెచ్. సరస్వతి, 13వ వార్డు, ఇబ్రహీంపట్నం

డోర్‌లాక్ అని ఎంట్రీ చేస్తున్నారు



ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 7గంటల వరకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాం. డోర్‌లాక్ అని వరుసగా ఎనిమిది నెలల పాటు కరెంటు బిల్లులో ఎంట్రీ చేశారు. తర్వాత వెయ్యి యూనిట్లకు ఒకేసారి రూ.10,557 చార్జీ వేశారు. అంత మొత్తాన్ని ఒకేసారి ఎల్లా చెల్లిస్తాం.

–పవిత్ర,ఇన్‌స్పెక్షన్ బంగ్లా,ఇబ్రహీంపట్నం

అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కేసీఆర్‌పై కోపంతో ఆయన గుర్తులను చెరిపేసేలా పనులు చేయొద్దని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ హాల్‌లో శుక్రవారం 102 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో శంకుస్థాపన చేసిన మెడికల్ కళాశాల, 400 పడకల ఆస్పత్రి భవనాల నిర్మాణాలను ఈ ఏడాదే ప్రారంభించాలని, ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు తాము కేటాయించిన ఇళ్ల స్థలాలను 15 రోజుల్లో అప్పగించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గురుకులాలను ఎత్తివేయడానికి చూస్తోందని విమర్శించారు. వాటిని డిగ్రీ స్థాయికి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, తహసీల్దార్ గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు టి.ఇందిర, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కాకి రాములు, జి.సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎం.జయేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



అన్మాస్‌పల్లి సమీపంలో ప్రభుత్వ భూములను పరిశీలించి చర్చిస్తున్న అధికారులు, నాయకులు

ప్రభుత్వ భూముల పరిశీలన

- స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు

కడ్తాల్: రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం (స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానికి అతి సమీపంలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ఇటీవలే నిర్ణయం తీసుకుంది. 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావిస్తుండడంతో అధికారులు ప్రభుత్వ భూముల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 260/29, 321లలో ఉన్న ప్రభుత్వ భూములను కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. సర్వే నంబర్ 260/29లో సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మాజీ సర్పంచ్ శంకర్, డీఐలు కృష్ణయ్య, శ్రీనివాస్, సర్వేయర్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీసుకుంటే తప్పేంటి?

- గెజిటెడ్ సంతకానికి పైసా వసూలు
- రూ.500 నుంచి రూ.1000 వరకు
- మండల వైద్యాధికారి నిర్వాకం
- ఇదేమని అడిగితే.. తీసుకుంటే తప్పేముందని ఎదురు ప్రశ్న!



గెజిటెడ్ సంతకానికి వెంకటయ్య నుంచి డబ్బులు తీసుకుంటున్న మండల వైద్యాధికారి వాణి

మొయినాబాద్: గెజిటెడ్ సంతకానికి మండలవైద్యాధికారి వసూళ్ల పర్వం ప్రారంభించారు. అడిగితే తీసుకుంటే తప్పేముందని ఎదురు ప్రశ్నించడం విశేషం. గెజిటెడ్ సంతకానికి వచ్చిన పేదల దగ్గర రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తూ మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే దుకాణం తెరిచారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన ఆలూరి వెంకటయ్య మూడు నెలల క్రితం కూతురు వివాహం చేశాడు. కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసేందుకు గెజిటెడ్ సంతకం కోసం శుక్రవారం మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. మండల వైద్యాధికారి డాక్టర్ వాణిని కలిసి దరఖాస్తు ఫారం ఇచ్చాడు. కొంతసేపు వేచి ఉండాలని ఆమె చెప్పింది. గంటకు పైగా వేచి ఉన్నాక అటెండర్ వచ్చి సంతకం చేయడానికి డబ్బులు అవుతాయని అడిగాడు. ఎంత కావాలని అడగ్గా అతడు సరిగా సమాధానం చెప్పకుండా దరఖాస్తు ఫారం తీసుకెళ్లి వైద్యాధికారి ముందు పెట్టాడు. సంతకం పెట్టాక రూ.500 ఇవ్వాలని డాక్టర్ వాణి అడగడంతో వెంకటయ్య డబ్బులు తీసిచ్చాడు. విషయం తెలుసుకున్న 'సాక్షి' ఆస్పత్రికి వెళ్లి గెజిటెడ్ సంతకానికి డబ్బులు తీసుకుంటారా అని ప్రశ్నించగా తీసుకుంటే తప్పేముంది అంటూ డాక్టర్ ఎదురు ప్రశ్నించారు. దీంతో అక్కడున్నవారంతా అవాక్కయ్యారు.

ఆది నుంచీ వివాదాస్పదమే..

మొయినాబాద్ పీహెచ్‌సీ డాక్టర్, మండల వైద్యాధికారి వాణి తీరు ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. పీహెచ్‌సీలో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కొన్నేళ్లుగా నిర్వహించడమేలేదు. అభివృద్ధి నిధులను ఖర్చుచేయకుండానే ఇష్టారాజ్యంగా డ్రా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంత కాలంగా ఆస్పత్రికి గెజిటెడ్ సంతకాలు, మెడికల్ సర్టిఫికెట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకోసం వచ్చిన వారి నుంచి రూ.500-1000 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఓ ఏఎన్‌ఎంను డాక్టర్ కొట్టడానికి వెళ్లడంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించకుండా ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటారని స్థానికులు చెబుతున్నారు. డాక్టర్ పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా స్పందించడం లేదని వైద్య సిబ్బంది, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

పీహెచ్‌సీల్లో అవినీతిని సహించేది లేదు. వైద్యాధికారులు, సిబ్బందికి గతంలోనే ఈ విషయాన్ని చెప్పాం. మొయినాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ పనితీరుపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ఎవరైనా అవినీతికి పాల్పడినా, సరిగా పనిచేయకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

నీట్ పేపర్ లీక్ బాధ్యత కేంద్రానిదే..

ప్రధాని రాజీనామా చేయాలి

- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి
- పరీక్ష రద్దుకు కాంగ్రెస్ నాయకుల డిమాండ్



కడ్తాల్: జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకుల ధర్నా

కడ్తాల్: నీట్ పేపర్ లీక్‌కు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నీట్ అవకతవలకు వ్యతిరేకంగా ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో, నిరసన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పేపర్ లీకేజీకి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని, పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లీకేజీ వ్యవహారాన్ని కప్పి పెట్టేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. ఈ అక్రమాలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు చేగూరి వెంకటేశ్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, రాంచందర్, హీరాసింగ్, శాబుద్దీన్, రాజేశ్, శంకర్, రవి, శ్రీకాంత్, రాజేందర్‌గౌడ్, యాదయ్య, భరత్, తులసీరాం, ఇమ్రాన్‌బాబా, నరేశ్‌నాయక్ తదితరులున్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి: ఎస్‌ఎఫ్‌ఐ

ఇబ్రహీంపట్నం: నీట్ పరీక్షను రద్దు చేసి పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గ్రేస్ మార్కులు సాధించిన విద్యార్థులకు అదనపు మార్కులు రద్దు చేసి రీ ఎగ్జామ్ నిర్వహిస్తామని చెప్పడం సరికాదన్నారు. పరీక్షను పూర్తిగా రద్దు చేసి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ ఎన్‌టీఏ ఏకపక్షంగా వ్యవరిస్తోందన్నారు. పరీక్ష రోజుకు ముందే బీహార్ రాష్ట్రంలో పాట్నాలో 13 మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారని, హర్యానాలోనూ ఒకే సీరియల్ నెంబర్ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయన్నారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి లీకేజీ అంశాలే వెలుగులోకి వచ్చాయన్నారు. వాటన్నింటిపైనా సమగ్ర విచారణ చేయకుండా రీఎగ్జామ్ పెడతామనడం సరికాదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ ర్యాలీలో ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, డివిజన్ కార్యదర్శి తరంగ్, డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, లక్ష్మణ్, అభిలాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం లోన్ చెల్లింపునకు కత్తితో బెదిరింపు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మీర్‌పేట: పేటీఎం యాప్‌లో తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించాలని లేదంటే చంపుతామంటూ ఏజెంట్లు ఓ బేకరీ యజమానిని బెదిరించారు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన ప్రకారం.. గుర్రంగూడ టీచర్స్ కాలనీకి చెందిన ఇరుగండ్ల అశోక్ బడంగ్‌పేటలో సెకండ్ హోం బేకరీ నడిపిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం తన భార్య జ్యోతి, స్నేహితుడు డేవిడ్‌ల పేరిట పేటీఎం నుంచి రూ.6లక్షల లోన్ తీసుకున్నాడు. వాయిదా రూపంలో రూ.1.60లక్షలు చెల్లించాడు. వ్యాపారంలో నష్టం రావడంతో వాయిదా చెల్లించలేదు. దీంతో సదరు కంపెనీ ఏజెంట్లు అశోక్‌ను సంప్రదించారు. వ్యాపారంలో నష్టం వాటిల్లడంతో వాయిదాలు ఆలస్యమయ్యాయని వీలైనంత త్వరగా చెల్లిస్తానన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం అశోక్, అతని స్నేహితులు జీవన్, డేవిడ్ ఓ రెస్టారెంట్‌లో ఉండగా.. పేటీఎం ఏజెంట్లు అక్రమంగా లోనకి ప్రవేశించి లోన్ కట్టకుంటే చంపేస్తామంటూ కత్తి చూపి బెదిరించారు. అక్కడ నుంచి తప్పించుకున్న అశోక్ మీర్‌పేట ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పేటీఎం ఏజెంట్లు గురుచరణ్‌సింగ్, మహేశ్, పవన్, చిరంజీవితో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు గుర్తించామని, ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మందలో మేకలు మాయం

పోలీసులకు ఫిర్యాదు

యాచారం: మందలోంచి ఏడు మేకలు, ఒక మేక పోతును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వివరాలు.. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన నిమ్మ రాజు పుల్లయ్యకు చెందిన మందలో రూ.2.5 లక్షల విలువజేసే ఏడు మేకలు, ఒక పోతును గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకుపోయారు. శుక్రవారం గుర్తించిన పుల్లయ్య యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పదవ వార్డులో, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బీఆర్‌ఎస్ నేత చెరుకు శివ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల దేవాలయంతో సమానమన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వింటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ప్రతీ ఒక్కరు పేద విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాలని చెప్పారు. తన తల్లి చెరుకు ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన శివను అభినందించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, ఒగ్గు కిషోర్, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.16.30కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



ఆదిబట్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఆదిబట్లలో వసతుల కల్పనకు పాలకవర్గం నిర్ణయం
- మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించడానికి పాలకవర్గం, అధికారులు కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో రూ.16.30కోట్ల అంచనా వ్యయంతో కూడిన బడ్జెట్‌కు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. 70 గజాల లోపు ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. చైర్మన్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్లు, వీధి దీపాల సమస్యలతో పాటు వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్, కె.మౌనిక, ఎన్.మౌనిక, లావణ్య, అర్చన, సంధ్య, నాగేశ్, హరిదాసుగౌడ్, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, ఇంజనీర్ ఆంజనేయులు, టీపీఓ అబీబ్‌ఉన్నీసా, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ బలవన్మరణం

కందుకూరు: బతుకుదెరువు కోసం ఒరిస్సా నుంచి వచ్చిన ఓ వ్యవసాయ కూలీ బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోడో పాంద(27) అనే యువకుడు నాలుగేళ్లుగా మండలంలోని అగర్‌మియాగూడ పరిధిలోని తుమ్మల శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ పొలంలో పనులు చేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గదిలో సీలింగ్ రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గుర్తించిన పొలం యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతని సెల్ ఫోన్‌లో పెట్టిన స్టేటస్‌లు, ఓ యువతితో ఫోన్ మాట్లాడిన కాల్ లిస్టు ఆధారంగా ఆత్మహత్యకు ప్రేమనే కారణంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సీఐ మక్బూల్‌జానీ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రావణ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బావిలో దూకి వృద్ధురాలు..

చేవెళ్ల: బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువెళ్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఉషగారి జంగమ్మ(78) ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలం క్రితం ఆమె కూతురు అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మానసిక వేదనకు గురవుతున్న జంగమ్మ సాయంత్రం ఎవరికీ చెప్పకుండా వెళ్లి బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆమెను బయటకు తీయగా అప్పటికే మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక భారతి సిమెంట్

టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సహేర్



తాపీమేస్త్రీలకు బహుమతి అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ఫైవ్‌స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సహేర్ తెలిపారు. పెద్ద అంబర్‌పేటలోని భవానీ స్టీల్ ట్రేడర్స్‌లో శుక్రవారం ఆయన తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ సహేర్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జి, రహదారులకు సరైన ఎంపికన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సాయం చేస్తారని వివరించారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ వేగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్స్ షాహెర్, నర్సింహులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

దోపిడీ దొంగలను పట్టుకుంటాం



తలకొండపల్లి: నేరం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీసీపీ తదితరులు

డీసీపీ రాజేశ్

తలకొండపల్లి: దారి దోపిడీ చేస్తున్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ బల్ల రాజేశ్ అన్నారు. బుధవారం అర్ధరాత్రి దారిదోపిడీ జరిగిన స్థలాన్ని శుక్రవారం డీసీపీ పరిశీలించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎలాంటి నేరాలు జరుగుతున్నాయని.. పాత నేరస్తుల కదలికలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు బలరాం, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేశంపేట ఠాణా సందర్శన

కేశంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శంషాబాద్ డీసీపీ రాజేష్ శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇటీవల జరిగిన చైన్‌స్నాచింగ్ జరిగిన ప్రదేశానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. చోరీలు, సైబర్ క్రైమ్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల అదుపునకు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ లింగం ఉన్నారు.

కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

కడ్తాల్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఏఎస్ఐ నిరంజన్ ఉన్నారు.

రాళ్ల లోడ్ ఖాళీ చేస్తుండగా..

- టిప్పర్‌కు తగిలిన విద్యుత్ వైర్లు
- షాక్‌తో డ్రైవర్ మృతి



విద్యుదాఘాతంతో దగ్ధమవుతున్న టిప్పర్

అబ్దుల్లాపూర్‌మెట్: రాళ్లలోడ్ ఖాళీ చేస్తున్న టిప్పర్ విద్యుత్ వైర్లకు తగలడంతో వాహనం దగ్ధమవ్వగా.. విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్(19) పెద్ద అంబర్‌పేటలో నివాసముంటూ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి కోహెడ శివారులో నిర్మాణం కొనసాగుతున్న మైత్రి విల్లాస్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం టిప్పర్‌లో తెచ్చిన పెద్ద బండరాళ్లను ఖాళీ చేస్తుండగా విద్యుత్ వైర్లకు తొట్టి తగిలింది. దీంతో డ్రైవర్ విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఆయన్ను వనస్థలిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులకు కేసు దర్యాప్తు చేపట్టారు.

దాతల కృషి అభినందనీయం

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుజాత

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించే దాతల కృషి అభినందనీయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఎంపీపీ కోట్ల ప్రశాంతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందనవెళ్లి, హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 500 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా కల్వ సుజాత మాట్లాడుతూ.. విద్యతో విద్యార్థులు ఉన్నతంగా ఎదగవచ్చన్నారు. పేద విద్యార్థులకు ఎల్లప్పుడు సహకరిస్తామని బొంతపల్లి విద్యాసాగర్, సుజాత చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ.. శ్రద్ధగా చదువుతూ.. లక్ష్యసాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, బొంతపల్లి వీరయ్య, నరాల పూర్ణచందర్, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదతరులున్నారు.

ఆస్పత్రికి వెళ్తూ అనంతలోకాలకు..

కొత్తూరు: అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో శుక్రవారం పాపిరస్‌పోర్ట్ రిసార్ట్స్ ఎదురుగా జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పర్వతాలు భార్య పద్మమ్మ(45)కు వెన్నుపూస నొప్పిగా ఉండడంతో వైద్య పరీక్షలకు బైక్ శంషాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పాపిరస్ పోర్ట్ రిసార్ట్స్ వద్ద వీరి వెనుకనుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై నుంచి కింద పడిపోయిన పద్మమ్మపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తిపై కత్తితో దాడి

నిందితుడికి రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: మాట వినలేదని వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన పట్టణంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఓల్డ్ ఆశియానా హోటల్ యజమాని సాబేర్ తన హోటల్ సామగ్రి లోపల పెట్టాలని పక్క హోటల్‌లో పనిచేసే మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అహ్మద్‌ను ఆదేశించాడు. ఈ విషయంలో సాబేర్, అహ్మద్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన సాబేర్ అహ్మద్‌పై కూరగాయలు కోసే కత్తితో దాడి చేశాడు. కత్తి దాడిలో గాయపడిన అహ్మద్‌ను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. నిందితుడు సాబేర్ ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపారు.